క్లుప్తంగా

నేడు వెల్లాలలో రథోత్సవం

రాజుపాళెం : మండలంలోని వెల్లాల పుణ్యక్షేత్రంలో బుధవారం పుష్ప రథోత్సవం (తిరుణాల) జరగనుందని ఈఓ వెంకటరమణ, ఉత్సవ కమిటీ సభ్యులు లక్ష్మినారాయణరెడ్డి చెప్పారు. భక్తులు పెద్ద ఎత్తున హాజరై చెన్నకేశవ, సంజీవరాయస్వామి వార్లను దర్శించుకుంటుండడంతో తగిన ఏర్పాట్లు చేశామన్నారు. ఉదయం 11 గంటలకు ఉత్సవ విగ్రహాలకు పూజలు, హోమాలు జరుగుతాయని, అనంతరం పురవీధుల్లో రథంపై స్వామిని ఊరేగిస్తారని తెలిపారు. తిరుణాలకు వచ్చే భక్తులకు అన్నదానం, భక్తుల సహకారంతో మజ్జిగ, తాగునీరు ఏర్పాటు చేశామన్నారు. ప్రస్తుతం వెల్లాల గ్రామం భక్తులు, కొత్త కొత్త దుకాణాలు, బొమ్మలతో కళకళ లాడుతోంది.

అంగన్‌వాడీ కేంద్రంలో సంసిద్ధత ఉత్సవం

చాపాడు : అంగన్‌వాడీ కేంద్రాలలో చిన్నప్పటి నుంచే విద్యాబుద్ధులు నేర్పిస్తారని ఐసీడీఎస్ సీడీపీఓ సావిత్రమ్మ పేర్కొన్నారు. మండలంలోని శ్రీరాములపేటలోని అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం పాఠశాల సంసిద్ధత ఉత్సవ వేడుక నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన సీడీపీఓ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలలో పిల్లలకు వారి తల్లులకు పోషకాహారంతో కూడిన ఆహారం అందజేస్తారన్నారు. పాఠశాలలో పిల్లల్లో ఎదుగుదలతోపాటు చిన్నప్పటి నుంచే ఆటలు, చదువు పట్ల అవగాహన కల్పిస్తారన్నారు. గ్రామాల్లోని తల్లిదండ్రులు తప్పనిసరిగా తమ పిల్లలను అంగన్వాడీ కేంద్రాలకు పంపించాలని సూచించారు. సర్పంచ్ రాజేష్‌రెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులరెడ్డి, గ్రామ సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

విజయోత్సవ ర్యాలీ

పోరుమామిళ్ల : ఆపరేషన్ సిందూర్‌తో పాకిస్తాన్‌కు గట్టిగా బుద్ధి చెప్పి విజయం సాధించిన భారత సైనికుల పోరాటానికి మద్దతుగా మంగళవారం సాయంత్రం 6 గంటలకు పోరుమామిళ్లలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. పోలీస్‌స్టేషన్ నుంచి ఆర్టీసీ బస్టాండు వరకు శాంతియుతంగా సాగిన ఈ ర్యాలీలో మాజీ సైనికులు, ఉపాధ్యాయ సంఘాలు, ఉద్యోగ సంఘాలు, జర్నలిస్టులు, స్వచ్ఛంద సేవా సంస్థలు, ఆర్యవైశ్య సంఘం, మానవహక్కుల సంఘం, పట్టణ వైద్యులు, పెన్షనర్స్ అసోసియేషన్, ఐసీడీయస్ అధికారులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు నేరం

రాజుపాళెం : బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని సచివాలయ మహిళా పోలీస్ రంజనీదేవి అన్నారు. మండలంలోని అర్కటవేముల అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం జరిగిన వేసవి శిక్షణ తరగతులు నిర్వహించారు. కౌమార దశలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, బాల్యవివాహాలు, కిశోర వికాసంపై బాలికలకు వివరించారు. సుబ్బరత్నమ్మ లక్ష్మీదేవి, వసుంధర, వరలక్ష్మి, శ్రీవాణి, నిర్మల పాల్గొన్నారు.

బాలల హక్కులపై అవగాహన

ప్రొద్దుటూరు రూరల్ : కిశోర వికాసం-వేసవి శిక్షణ ప్రణాళికలో భాగంగా మండలంలోని ఈశ్వర్‌రెడ్డి నగర్, సుబ్బారావు కొట్టాలలో బాలికలకు చట్టంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్ వైజర్ ఈశ్వరమ్మ మాట్లాడుతూ బాలికలను లైంగిక వేధింపులకు గురిచేస్తే ఫోక్సో చట్టం కింద కఠినమైన చర్యలు ఉంటాయన్నారు. సీహెచ్ఓ కృష్ణమ్మ, బీఏ.వరప్రసాద్, సౌజన్య, రజియాబేగం, గీత పాల్గొన్నారు.

కేఆర్ కృష్ణయ్య శ్రేష్టి జయంతి

బ్రహ్మంగారిమఠం : ఆవోపా వ్యవస్థాపకుడు కేఆర్ కృష్ణయ్య శ్రేష్టి జయంతి మంగళవారం బి.మఠానికి చెందిన ఆవోపా రాష్ట్ర ఈసీ మెంబర్ బింగి సూర్యనారాయణ ఆధ్వర్యంలో స్థానిక అమ్మవారిశాలలో జయంతి వేడుక జరిపారు. ముందుగా కేఆర్ కృష్ణయ్య శ్రేష్టి చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. ఆవోపా యూనిట్ కార్యదర్శి పత్తి సురేష్, కోశాధికారి బింగి సురేష్ పాల్గొన్నారు.

పరామర్శ



వైఎస్ జగన్‌తో ఫోన్‌లో మాట్లాడుతున్న కృష్ణమ్మ

పోరుమామిళ్ల: పోరుమామిళ్లకు చెందిన సీనియర్ మహిళానేత, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మహిళా ఆర్థిక సంస్థ మాజీ చైర్ పర్సన్ కృష్ణమ్మను రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధ్యక్షులు వైయస్ జగన్ మోహన్ రెడ్డి మంగళవారం పరామర్శించారు. ఇటీవల కృష్ణమ్మ అనారోగ్యంతో హైదరాబాదులో అపోలో ఆసుపత్రిలో చికిత్స పొంది ఇంటికి వచ్చారు. కృష్ణమ్మ అనారోగ్యం గురించి తెలుసుకున్న వైఎస్ వజగన్‌మోహన్‌రెడ్డి ఆమెకు ఫోన్ చేసి మాట్లాడారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో జైలు

మైదుకూరు : మద్యం సేవించి వాహనాన్ని నడిపిన కేసులో ఓ వ్యక్తికి కోర్టు పది రోజులు జైలు శిక్ష, రూ.2వేలు జరిమానా విధించినట్లు అర్బన్ ఎస్ఐ సుబ్బారావు మంగళవారం తెలిపారు. వాహనాల తనిఖీల్లో దువ్వూరుకు చెందిన మహ్మద్ బషీర్ బొలెరో క్యాంపర్ వాహనాన్ని మద్యం సేవించి నడుపుతూ పట్టుబడినట్లు ఎస్ఐ పేర్కొన్నారు. అతడిని కోర్టు హాజరుపరచగా న్యాయమూర్తి 10 రోజులు జైలు శిక్ష, రూ.2వేలు జరిమానా విధించినట్లు వివరించారు.

వాహనాలకు తుప్పు.. ఎవరిదీ తప్పు?











ఒకప్పుడు అధికారులు మాపై కూర్చొంటే దర్జాగా తిరిగాం.. దర్పం ప్రదర్శిస్తూ ఠీవీగా ముందుకు వెళ్లి నిల్చున్నాం. జనం ముందు మేము వెళ్లి ఆగినప్పుడు వారు దండాలు పెడుతుంటే మాకే పెడుతున్నారనే గర్వంతో పులకించి పోయేవారం... ఇలా జిల్లా అంతటా తిరిగి తిరిగి అలుపొచ్చింది.. మా ఇంజిన్లు, చక్రాలు ముందుకు కదలడానికి మొరాయించాయి. దీంతో ఇదిగో ఇలా మూలన పడేశారు. తుక్కుకైనా వేస్తే కొత్తగా మళ్లీ పుడతామన్న ఆశతో ఉన్నాం.

– రమేష్ తీట్ల, సాక్షి ఫోటోగ్రాఫర్, కడప

పట్టణ పరిశుభ్రతకు ప్రతిఒక్కరూ కృషి చేయాలి



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి

బద్వేలు అర్బన్ : పట్టణ పరిశుభ్రతకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని మున్సిపల్ చైర్మన్ వాకమల్ల రాజగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయ సభా భవనంలో నిర్వహించిన పిగ్ మెనాస్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో కమిటీ చైర్మన్, మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ పట్టణంలో పందుల సంచారం అధికంగా ఉన్నట్లు తరచూ ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో నివాస ప్రాంతాల్లో పందులు తిరగకుండా కట్టడి చేయాల్సిన అవసరం ఉందని, ఇందుకోసం పట్టణం వెలుపల పందుల యజమానులకు స్థలం కేటాయించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. పట్టణం వెలుపల స్థలం కేటాయిస్తే అక్కడికి వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నామని పందుల యజమానులు అంగీకరించారు. సమావేశంలో కమిటీ కన్వీనర్, మున్సిపల్ కమిషనర్ వి.వి.నరసింహారెడ్డి, గోపవరం తహసీల్దారు త్రిభువన్‌రెడ్డి, వెటర్నరీ అసిస్టెంట్ డైరెక్టర్ నాగభూషణం, బద్వేలు డిప్యూటీ తహసీల్దారు శ్రీనివాసులు, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ సతీష్, పట్టణ ఎస్ఐ జయరామిరెడ్డి, గాంధీనగర్ పీహెచ్‌సీ వైద్యాధికారి సి.శరత్‌చంద్ర, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రమణయ్య పాల్గొన్నారు.

పెండింగ్ కేసులపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న డీఎస్పీ రాజేంద్రప్రసాద్

బద్వేలు అర్బన్ : పెండింగ్ కేసులపై దృష్టి సారించి వీలైనంత త్వరగా కేసులను పరిష్కరించాలని మైదుకూరు డీఎస్పీ జి.రాజేంద్రప్రసాద్ సీఐ, ఎస్ఐలకు సూచించారు. మంగళవారం స్థానిక రూరల్ సీఐ కార్యాలయంలో బద్వేలు అర్బన్, బద్వేలు రూరల్, పోరుమామిళ్ల సర్కిల్‌ల సీఐలు, ఎస్ఐలతో నిర్వహించిన నేర సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ పెండింగ్ కేసుల విచారణను వేగవంతం చేయడంతో పాటు ప్రతి కేసును ఖచ్చితమైన ప్రణాళికతో దర్యాప్తు చేయాలని కోరారు. అసాంఘీక కార్యకలాపాలపై దృష్టి సారించడంతో పాటు చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న వ్యక్తులపై నిఘా ఉంచాలని సూచించారు. ముఖ్యంగా పాత నేరస్తుల నడవడికను గమనిస్తూ ఉండటంతో పాటు నెలకొకసారి పాత నేరస్తులకు కౌన్సిలింగ్ ఇవ్వాలని సూచించారు. చోరీలు, అసాంఘీక కార్యకలాపాల నియంత్రణకు గట్టిగా కృషి చేయాలని తెలిపారు. అంతేకాకుండా రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని కోరారు. అనంతరం సర్కిల్‌ల వారీగా ఆయా కేసుల్లో పురోగతిని పరిశీలించి సిబ్బందికి సూచనలు, సలహాలు ఇచ్చారు. సమావేశంలో అర్బన్, రూరల్, పోరుమామిళ్ల సీఐలు రాజగోపాల్, నాగభూషణ్, శ్రీనివాసులు, ఎస్ఐలు సత్యనారాయణ, శ్రీకాంత్, రామకృష్ణ, తిమోతి, యోగేంద్ర, వెంకటసురేష్, జయరామిరెడ్డి, ఏఎస్ఐ నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పందులను వెంటనే తరలించండి



కాల్వలో పూడికతీత పనులను పరిశీలిస్తున్న కమిషనర్

ప్రొద్దుటూరు : పట్టణ పరిధిలో పందులను వెంటనే తరలించాలని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున తెలిపారు. మంగళవారం సాయంత్రం పందుల పెంపకం దారులతో జరిగిన సమావేశంలో కమిషనర్ మాట్లాడుతూ వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని పందులను బయటికి తరలించాలని, లేకపోతే శుక్రవారం మునిసపాలిటీ సిబ్బంది, పోలీసులతో కలిసి పందులను తరలిస్తామని హెచ్చరించారు. పట్టణంలోని రెండు-మూడు కిలో మీటర్ల పరిధిలో పందుల పెంపకందారులకు స్థలం కేటాయిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు నూర్ బాషా, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

ప్రధాన కాలువలో పూడిక తొలగింపు

ముందు జాగ్రత్త చర్యగా వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని పట్టణంలోని ప్రధాన మురికి కాలువల్లో పూడికతీత పనులను మంగళవారం ప్రారంభించారు. మదూరు కాలువలో జరుగుతున్న పనులను మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున పరిశీలించారు. ప్రజలకు ఇబ్బందిలేకుండా పూడికతీత పనులు చేపట్టాలని కమిషనర్ సూచించారు.

అందరి సహకారంతో చర్చి నిర్మాణం



పిల్లర్ల దశలో ఉన్న సీఎస్ఐ చర్చి నిర్మాణం

దువ్వూరు : మండల పరిధిలోని మాచనపల్లె దళితవాడ(ఎస్సీ కాలనీ)లో కాలనీ వాసులు సీఎస్ఐ చర్చి నిర్మాణం చేపడుతున్నారు. గ్రామంలోని 100 కుటుంబాల వారు ఇంటింటికి రూ.10వేలు చొప్పున చందాలు వేసుకుని చర్చి నిర్మాణ పనులను జరుపుతున్నారు. ప్రస్తుతం పిల్లర్ల దశలో పనులు జరుగుతున్నాయి. గ్రామంలో 30 ఏళ్ల క్రితం నిర్మితమైన చర్చి శిథిలావస్థకు చేరటంతో దీని స్థానంలో కొత్త చర్చి నిర్మించుకునేందుకు గ్రామస్తులు నిర్ణయించడంతో గతేడాది పాత చర్చిని తొలగించి దీని స్థానంలో కొత్త చర్చిని నిర్మిస్తున్నారు. గ్రామస్తులతో పాటు ఇప్పటికే పలువురు దాతలు సైతం ఈ చర్చి నిర్మాణానికి సహకారం అందించారు. రూ.50లక్షల అంచనా వ్యయంతో చర్చి నిర్మాణ పనులు చేపట్టామని ప్రతి ఇంటి నుంచి అందే నగదుతో పాటు గ్రామంలోని పెద్దలు, దాతల సహకారం తీసుకుంటామని గ్రామస్తులు తెలిపారు. ప్రతి ఇంటి నుంచి చర్చి నిర్మాణం కోసం అందించే రూ.10వేల నగదుతో పాటు వ్యక్తిగతంగా అదనంగా చందాలు అందివచ్చని నిర్మాణ నిర్వాహకులు ఈ సందర్భంగా కోరారు.

కార్మిక సమస్యలపై చర్చించాం



సమావేశంలో మాట్లాడుతున్న యూనియన్ నాయకులు

ప్రొద్దుటూరు : శ్రమ దోపిడీకి గురవుతున్న నాన్ పీహెచ్ వర్కర్ల సమస్యలపై మంగళవారం మున్సిపల్ కమిషనర్ ఆఫ్ డైరెక్టర్ డాక్టర్ సంపత్‌కుమార్‌తో చర్చించినట్లు ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోరుమామిళ్ల సుబ్బరాయుడు తెలిపారు. వడ్డేశ్వరంలోని సీడీఎంఏ కార్యాలయంలో ఏఐటీయూసీ నేతలతో కలిసి జాయింట్ మీటింగ్ ఏర్పాటు చేశారన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాదయినా మున్సిపాలిటీల్లోని నాన్ పీహెచ్ వర్కర్ల సమస్యలలో ఏ ఒక్క సమస్య పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపలేదని ప్రశ్నించామన్నారు. పారిశుద్ధ్య కార్మికులతో సమానంగా ఇంజినీరింగ్ కార్మికులు వరదల్లోనూ, కరోనా విపత్తుల సమయాల్లో సేవలందించినా కేవలం రూ.15వేలతో కార్మికులు సరిపెట్టుకోవాల్సి వస్తోందని తెలిపారు. గత ప్రభుత్వంలో తొమ్మిది మంది ఐఏఎస్‌లతో కమిటీ ఏర్పాటుచేసి నాన్ పీహెచ్ వర్కర్లకు గ్రేడ్ల వారిగా వేతనాలు ఇవ్వాలని సిఫారసు చేసిందన్నారు. కార్మిక సమస్యలపై ప్రభుత్వానికి నోట్ పంపామని, త్వరలో మంత్రి నారాయణతో కలిసి జాయింట్ మీటింగ్ ఏర్పాటుచేసి పరిష్కారానికి కృషి చేస్తామని సీడీఎంఏ తెలిపారన్నారు. సమావేశంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆసుల రంగనాయకులు, ఉపాధ్యక్షుడు రాజేష్ గౌడ్, జాన్, అనురాధ, మురళీకృష్ణ గౌడ్, గోపాలకృష్ణారెడ్డి, ఆప్కాస్ జీఎం నాగేంద్రప్రసాద్ పాల్గొన్నారన్నారు.

భగవద్గీత ప్రచారం

బి.కోడూరు : మండలంలోని బి.కోడూరు, అక్కుపాలెం, రామసముద్రం, ఆనంవారిపల్లె గ్రామాల్లో బుధవారం త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞాన వేదిక కంభం కమిటీ ఆధ్వర్యంలో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం నిర్వహించారు. గ్రామస్తులకు ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన 101 త్రైత సిద్ధాంత ఆధ్యాత్మిక గ్రంథాలు గురించి వివరించి వారి జీవితంలో జ్ఞానమార్గాన్ని అనుసరించవలసిందిగా కోరారు. కార్యక్రమంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞాన వేదిక కంభం కమిటీ అధ్యక్షుడు నర్రాశ్రీనివాసరెడ్డి, సభ్యులు సి.హెచ్.రామకృష్ణ, వెంకటేశ్వర్లు, కె.రామకృష్ణ, శ్రీను, లక్ష్మి, శ్రీదేవి, తిరుపతయ్య, రాజ్యలక్ష్మి, బలరామ్, అంజలి, సరస్వతి, మస్తాన్, భాగ్యలక్ష్మిలు పాల్గొన్నారు.

పదోతరగతి విద్యార్థుల ప్రతిభ

ప్రొద్దుటూరు కల్చరల్ : మండలంలోని పూజ స్కూల్‌లో చదువుతున్న సీబీఎస్ఈ పదో తరగతి విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. మంగళవారం విడుదలైన పరీక్షల్లో 500 మార్కులకు గానూ శ్రీలక్ష్మీ ధన్యత 476, లహరిరెడ్డి 455, అఖిల్ అహ్మద్ 444, లలిత్ కుమార్‌రెడ్డి 443, భాస్విక్ అనంతరాజు 438, వివేక్ వర్ధన్ రెడ్డి 403, సాజిదా 395, మోహన ఈశ్వర్ 369, అయేషా బేగం 364 మార్కులు సాధించారు. వారిని సీఈఓ రూపాని కవిత, ప్రిన్సిపల్ భువనేశ్వరి, ఉపాధ్యాయులు అభినందించారు.

17న బండలాగుడు పోటీలు

కాశినాయన : మండలంలోని గొంటువారిపల్లె గ్రామంలో పోలేరమ్మ దేవాలయ శిఖర కలశ ప్రతిష్టా మహోత్సవం సందర్భంగా ఈ నెల 17వ తేదీన బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ పోటీల్లో మొదటి బహుమతిగా రూ.1.10 లక్షలు, రెండవ బహుమతిగా రూ.80 వేలు, మూడవ బహుమతిగా రూ.60 వేలు, నాల్గవ బహుమతిగా రూ.40 వేలు గెలుపొందిన వృషభాలకు అందజేస్తామని తెలిపారు. 17వ తేదీ ఉదయం 10 గంటలకు పోటీల్లో పాల్గొనే వారు పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

నివాళి

బద్వేలు అర్బన్ : మున్సిపాలిటీ పరిధిలోని మడకలవారిపల్లె గ్రామానికి చెందిన మాజీ మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ నాగం సుబ్బారెడ్డి తల్లి నారాయణమ్మ మంగళవారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్మన్ వాకమళ్లరాజగోపాల్‌రెడ్డి, నియోజకవర్గ బూత్‌కన్వీనర్ల సమన్వయకర్త కె.రమణారెడ్డి మడకలవారిపల్లెకు వెళ్లి నారాయణమ్మ భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చి పార్టీ పరంగా అన్నిరకాలుగా ఆదుకుంటామని భరోసా కల్పించారు. రఘురామిరెడ్డి, వెంకటసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

31న రాయలసీమ రైతు బహిరంగ సభ

ప్రొద్దుటూరు రూరల్ : కర్నూలు జిల్లాలోని సిద్దేశ్వరం అలుగు ప్రజా ప్రాజెక్టు వార్షికోత్సవం సందర్భంగా ఈ నెల 31న జరిగే రాయలసీమ రైతు బహిరంగ సభను జయప్రదం చేయాలని రైతు సేవా సమితి జిల్లా అధ్యక్షుడు ఏవీ రమణ పేర్కొన్నారు. మండలంలోని తాళ్లమాపురం గ్రామంలో మంగళవారం బహిరంగ సభ కరపత్రాలు ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాయలసీమలోని సాగు, తాగునీటి ప్రాజెక్టుల, పరిశ్రమల అభివృద్ధి పాలక పార్టీల నిర్లక్ష్యం వహిస్తున్నారని విమర్శించారు. పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసి ఆయకట్టు రైతులకు నీరు అందించాలన్నారు. రైతు బహిరంగ సభను జయప్రదం చేసేందుకు జిల్లాలోని అన్ని గ్రామాల్లో ప్రచార కార్యక్రమాలతో రైతులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆవుల రఘురాముడు, మాధవరెడ్డి, పోలయ్య, మాబు, అంజనమ్మ, సావిత్రి, సుబ్బమ్మ, తరుణ్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎస్ఐ చర్చిలో సీబీసీ



ర్యాలీగా వస్తున్న చిన్నారులు

చాపాడు : మండల కేంద్రంలోని సీఎస్ఐ చర్చిలో మంగళవారం సీబీసీ(చిల్డ్రన్ బైబిల్ క్యాంపు) నిర్వహించారు. వేసవి సెలవుల్లో పిల్లలు బయట తిరిగి ఎండలకు ఇబ్బంది పడకుండా సీబీసీ నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం గ్రోయింగ్ లీడర్స్ పేరుతో పిల్లలు స్ఫూర్తి పొందేలా తలకు బ్యాండేజ్ కట్టి చాపాడు పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్వీటీ, డాలీలు పిల్లలకు వేసవి సెలవుల్లో చేయాల్సిన పనులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలతో పాటు నీతి వాక్యాలు, బైబిల్ సందేశాన్ని తెలియజేశారు. వేసవి సెలవులు పొడవునా చిల్డ్రన్ బైబిల్ క్యాంపు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.

• అశ్వవాహనంపై ఊరేగిన అగస్త్యేశ్వరుడు



అశ్వవాహనంపై అగస్త్యేశ్వరస్వామి

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో స్వామి బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. మంగళవారం అగస్త్యేశ్వరుడికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, రాజరాజేశ్వరి దేవికి పంచామృతాభిషేకం, కుంకుమార్చన నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. గణపతి, నవగ్రహ, రుద్ర హోమాలను నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు. త్రిశూలస్నానం, కలశ ఉద్వాసన తదితర పూజా కార్యక్రమాలు వేద పండితుల ఆధ్వర్యంలో నిర్వహించారు. సాయంత్రం గంగా, రాజరాజేశ్వరీ సమేత అగస్త్యేశ్వరస్వామి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి అశ్వ వాహనంపై కొలువుదీర్చారు. అనంతరం పురవీధుల్లో శివ నామస్మరణ మధ్య ఘనంగా ఊరేగించారు. నృత్య తరంగణి ఫైన్ ఆర్ట్స్ అకాడమీ విద్యార్థుల నృత్య ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది.

• గజవాహనంపై చెన్నకేశవుడు



వెల్లాలలో గజ వాహనంపై ఉత్సవమూర్తులు

రాజుపాళెం : మండలంలోని వెల్లాలలో చెన్నకేశవ, సంజీవరాయ, భీమలింగేశ్వర స్వాముల బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆరో రోజున మంగళవారం రాత్రి గజ వాహనంపై శ్రీదేవి, భూదేవి సమేత శ్రీచెన్నకేశవ స్వామి విగ్రహాలను పురవీధుల్లో వైభవంగా ఊరేగించారు. ఉత్సవ మూర్తులను పల్లకిలో ఆశీనులుచేసి అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులు స్వాముల వారిని దర్శించుకుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈఓ వెంకటరమణ, ఉత్సవ కమిటీ సభ్యులు లక్ష్మినారాయణ రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ రామమోహన్, భక్తులు స్వాములకు ప్రత్యేక పూజలు చేశారు.

• ఘనంగా విగ్రహ ప్రతిష్ట



స్వామివారి గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

అట్లూరు : మండలంలోని కుంభగిరి గ్రామంలో శ్రీలక్ష్మీనరసింహస్వామి ధ్వజశిఖర కలశ నూతన విగ్రహ ప్రతిష్ఠ, కుంభాభిషేక మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. మూడు రోజుల పాటు నిర్వహించే ఈ మహోత్సవాల్లో భాగంగా రెండవ రోజైన మంగళవారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి గ్రామోత్సవం నిర్వహించారు. స్థానికులతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజల అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారికి పూజలు నిర్వహించారు. వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. రాత్రి పండరి భజన కార్యక్రమం నిర్వహించారు.

• ముగిసిన బ్రహ్మోత్సవాలు



బండను లాగుతున్న వృషభ రాజములు

మైదుకూరు : మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని కొత్తపాలెంలో మంగళవారం శ్రీ వీరాంజనేయ స్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా ముగిశాయి. రాష్ట్ర స్థాయి సీనియర్ కేటగిరి వృషభ రాజములకు బండలాగుడు పోటీలను నిర్వహించారు. ఆసక్తికరంగా సాగిన ఈ పోటీలో తాడిపత్రికి చెందిన రమేష్ బాబు యాదవ్, ప్రొద్దుటూరుకు చెందిన డి.గురివిరెడ్డిలకు చెందిన వృషభ రాజములు మొదటి స్థానంలో నిలవడంతో వాటి యజమానులకు రూ.80వేలు నగదు బహుమతిని అందుకున్నారు. తర్వాతి స్థానాల్లో నిలిచిన ఏడు జతల వృషభరాజముల యజమానులకు ఆలయ ధర్మకర్త చిట్టిబోయిన సుబ్బరాయుడు ఆధ్వర్యంలో నగదు బహుమతులు అందించారు.

• రసవత్తరంగా బండలాగుడు పోటీలు



పోటాపోటీగా బండలాగుతున్న వృషభాలు

గోపవరం : మండలంలోని వల్లెరవారిపల్లెలో శ్రీలక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా చివరి రోజైన మంగళవారం నిర్వహించిన బండలాగుడు పోటీలు రసవత్తరంగా సాగాయి. ఈ పోటీలకు వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరు, బద్వేలు, మైదుకూరు ప్రాంతాల నుండి వృషభాలు రాగా పోటాపోటీగా బండలాగుడు పోటీలు కొనసాగాయి. ఈ పోటీల్లో మొదటి బహుమతిగా రూ.50,116లు, రెండవ బహుమతి రూ.30,116లు, మూడవ బహుమతి రూ.20,116లు, నాల్గవ బహుమతి రూ.10,116లు, ఐదవ బహుమతి రూ.6,116లు వృషభాల యజమానులకు అందజేశారు. అలాగే బహుమతులు రాని వారికి కూడా కన్సోలేషన్ బహుమతులు అందజేశారు. మూడు రోజుల పాటు నిర్వహించిన ఈ బ్రహ్మోత్సవాలకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. వచ్చిన భక్తులకు నిర్వాహకులు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

వేడుకగా ఫాతిమామాత మహోత్సవం



దివ్యబలి పూజ నిర్వహిస్తున్న పీఠాధిపతి రెవ. సగినాల పాల్‌ప్రకాష్

బద్వేలు అర్బన్ : స్థానిక నెల్లూరు రోడ్డులోని ఫాతిమామాత చర్చిలో పునీత ఫాతిమామాత మహోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా స్థానిక మైదుకూరు రోడ్డులోని మదర్‌థెరిసా చర్చి నుండి ఫాతిమామాత చర్చి వరకు కడప బిషప్ రెవ. సగినాలపాల్ ప్రకాష్‌ను ఊరేగించారు. అనంతరం చర్చి ఆవరణలో బిషప్ రెవ. సగినాలపాల్ ప్రకాష్ ఆధ్వర్యంలో దివ్యబలిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1953లో ఫాతిమామాత పేరుతో బద్వేలు విచారణను ప్రారంభించారని, అప్పటి నుండి నేటి వరకు భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు జరుగుతున్నాయన్నారు. ప్రతి ఒక్కరు సేవాగుణం అలవర్చుకుని ఇతరులకు సహాయపడేలా ఉండాలని కోరారు. ప్రార్థనల్లో భాగంగా ఆలపించిన క్రీస్తుగేయాలు అలరించాయి. కార్యక్రమంలో ఫాతిమామాత పుణ్యక్షేత్రం విచారణ గురువులు రెవ. ఫాదర్ లక్కినేని ఆరోగ్యరాజ్, సహాయక గురువులు రెవ. ఫాదర్ నాగిపోగు రాజేంద్ర, జిల్లాలోని వివిధ విచారణల గురువులు, సహాయక గురువులు, అధిక సంఖ్యలో విశ్వాసులు పాల్గొన్నారు.